సాక్షి కామారెడ్డి

శనివారం : 15 : ఏప్రిల్ : 2023



నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం వేరువేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు.

- IIలో ▸



ఘనంగా బైసాఖీ

సిక్కులు శుక్రవారం బైసాఖీ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. నిజామాబాద్‌లో ర్యాలీ తీశారు.

- IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
41.9 /22.0

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

బంగారం తులం ధర రూ.61,100



కామారెడ్డి టౌన్: బంగారం ధర రోజురోజుకు పెరిగిపోతోంది. కామారెడ్డి బులియన్ మార్కెట్‌లో శుక్రవారం 10 గ్రాముల బంగారం ధర రూ. 61,100 పలికింది. ధర భారీగా పెరగడంతో గిరాకీ తగ్గిందని బంగారు వర్తకులు పేర్కొంటున్నారు.

పోచారం నీటి విడుదల పూర్తి



నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు ఆయకట్టు కింద యాసంగి పంటలసాగు కోసం చేపట్టిన నీటివిడుదల శుక్రవారంతో పూర్తయ్యింది. అధికారులు శుక్రవారం ప్రాజెక్టు గేట్లను మూసి ప్రధానకాలువలోకి నీటివిడుదలను నిలిపివేశారు. ఈ ఏడాది జనవరి 1న ప్రాజెక్టు నుంచి మొదటివిడత నీటి విడుదల చేపట్టారు. అప్పటి నుంచి 15 రోజులపాటు నీటిని విడుదల చేస్తూ 10 రోజులపాటు నీటివిడుదలను నిలుపుచేస్తూ ఐదువిడతలుగా ఆయకట్టుకు ప్రాజెక్టు నీటిని అందించారు. ఆయకట్టు పరిధిలో పంటలసాగు పూర్తి కావస్తుండడంతో అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్టులో 5 ఫీట్ల నీటిమట్టంతో 0.300 టీఎంసీల నీరు నిల్వ ఉందని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.

సాయిశ్రీకి సన్మానం




ఎల్లారెడ్డిరూరల్: జూనియర్ సివిల్ జడ్జి ఉద్యోగం సాధించిన ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన పద్మ సాయిశ్రీని శుక్రవారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ సన్మానించారు. ఎల్లారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నర్సింలు, నునుగొండ శ్రీనివాస్, న్యాయవాది పండరి తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి కరోనా పాజిటివ్

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ జిల్లాలో ఒక కోవిడ్ కేసు నమోదయ్యింది. ఇటీవల మళ్లీ కరోనా లక్షణాలు బయట పడుతుండటంతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. అన్ని ఆరోగ్య కేంద్రాలలో టెస్టులు చేస్తున్నారు. శుక్రవారం 43 మందికి పరీక్షలు చేయగా ఒకరికి పాజిటివ్ వచ్చింది.

టీ హబ్.. సేవలెప్పుడో!?



దేవునిపల్లి వద్ద నిర్మించిన టీ హబ్

జిల్లా కేంద్రంలో తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ సేవలు ఇంకా అందుబాటులోకి రాలేదు. టీ హబ్‌ను ప్రారంభిస్తే 57 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందే అవకాశాలున్నాయి. ఈ కేంద్రాన్ని త్వరగా ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

- పూర్తయిన భవన నిర్మాణం
- అందుబాటులోకి వస్తే ఉచితంగా 57 రకాల వైద్య పరీక్షలు
- త్వరగా ప్రారంభించాలంటున్న ప్రజలు

కామారెడ్డి టౌన్: చిన్నపాటి వ్యాధి వచ్చినా వైద్యులు రక్త పరీక్షలు, ఇతర పరీక్షలు రాయడం పరిపాటిగా మారింది. ప్రభుత్వ ఆస్పత్రులలో అన్ని రకాల పరీక్షలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉంది. వారు వైద్య పరీక్షలు, స్కానింగ్‌లకు వేలల్లో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలపై భారాన్ని తగ్గించడం కోసం ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు ప్రభుత్వం డయాగ్నోస్టిక్ హబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఏడాదిన్నర క్రితం జిల్లాకు టీ హబ్ మంజూరు చేసి, భవన నిర్మాణానికి రూ. 50 లక్షలు విడుదల చేసింది. దేవునిపల్లి పీహెచ్‌సీ పక్కన భవనం నిర్మించారు. ఈ భవనంలోని కింది అంతస్తులో ఎనిమిది, మొదటి అంతస్తులో ఐదు చొప్పున గదులున్నాయి.

మెరుగవనున్న సేవలు..

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులలో మధుమేహం, బీపీ, గుండె, కిడ్నీలు, ఊపిరితిత్తులు, క్యాన్సర్, థైరాయిడ్ తదితర పరీక్షలు చేసే అవకాశం ఇప్పటి వరకు లేదు. దీంతో పేద రోగులు ప్రైవేటు డయాగ్నోస్టిక్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. ఆయా పరీక్షలకు భారీగానే ఖర్చవుతోంది. టీ హబ్ అందుబాటులోకి వస్తే పేదలపై భారం తగ్గనుంది. భవన నిర్మాణం పూర్తి కావడంతో ఎప్పుడు ప్రారంభిస్తారో అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇంకా ఎండీ పాథాలజీ, ల్యాబ్ టెక్నిషియన్స్ నియామకాలు చేపట్టాల్సి ఉంది. పరికరాలు కూడా రావాల్సి ఉంది. పరికరాలను సమకూర్చి, వైద్యులు, సిబ్బందిని నియమించి, టీ హబ్‌ను ప్రారంభిస్తే రోగులను సేవలు మరింత మెరగయ్యే అవకాశాలున్నాయి.

చేసే పరీక్షలు..

టీ హబ్‌లో 57 రకాల వైద్య పరీక్షలు చేస్తారు. రక్త, మూత్ర పరీక్షలతో పాటు రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, క్యాన్సర్, సీబీపీ, ఈఎస్‌ఆర్, ఆర్‌బీసీ, ప్రొటీన్, ఎముకల పటుత్వం, మల, మూత్ర, డెంగీ, వైరల్, సీమన్, కొలెస్ట్రాల్, హెచ్‌ఐవీ వంటి సుమారు 57 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు. జిల్లా కేంద్ర ఆస్పత్రితోపాటు ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీల నుంచి రక్తనమూనాలను సేకరించి టీ హబ్‌కు పంపుతారు. రోగుల నుంచి సేకరించిన రక్త నమూనాలను టీ హబ్‌లో పరీక్షించి, సాయంత్రానికల్లా ఫలితాలను తిరిగి ఆస్పత్రులకు పంపిస్తారు.

త్వరలోనే ప్రారంభిస్తాం..



ఎంసీహెచ్ పక్కన చేపట్టిన టీ హబ్ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీనిని త్వరలోనే ప్రారంభిస్తాం. టీ హబ్ ద్వారా ప్రజలకు 57 రకాల రక్త, ఇతర పరీక్షలు ఉచితంగా అందిస్తాం. ఫలితాలు కూడా త్వరగా వస్తాయి. ఇది పేద, మధ్య తరగతి వారికి చాలా ప్రయోజకరంగా ఉంటుంది.

– లక్ష్మణ్ సింగ్, డీఎంహెచ్‌వో, కామారెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న అంబేడ్కర్ సంఘాల ప్రతినిధులు

భిక్కనూరులో ర్యాలీ

భిక్కనూరు: అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం భిక్కనూరులో ర్యాలీ తీశారు. గుర్రాల బండిపైన గౌతమబుద్ధుడు, అంబేడ్కర్ విగ్రహాలను ఉంచి ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సంఘం, అంబేడ్కర్ యువజన సంఘం అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దళితులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి టౌన్: అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శుక్రవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్ మాట్లాడారు. అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఆర్థికవేత్త అంబేడ్కర్ అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో కామారెడ్డిలో మెడికల్ కళాశాల ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు అంబేడ్కర్, జ్యోతీబా పూలే, సావిత్రి బాయి పూలే, జగ్జీవన్ రామ్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ వంటి మహనీయుల ఆశయాలను తెలియజేస్తూ పాటలు పాడి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్ రెడ్డి, కార్యదర్శి సాయిలు, బహుజన సంఘాల ప్రతినిధులు కొత్తపల్లి మల్లయ్య, సిద్దిరాములు, సంపత్, సుదర్శన్, శివరాం, రాజయ్య, విఠల్, నాగరాజు, లక్ష్మణ్ యాదవ్, బాగయ్య, సాయి రెడ్డి, చక్రధర్, ఎర్ర శివరాం, పంచశీల, వెంకటి పాల్గొన్నారు.



కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ పాటిల్

డబుల్ బెడ్ రూం ఇళ్లివ్వాలి



రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న అరుణతార

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార డిమాండ్
- మద్నూర్‌లో రిలే దీక్షలు ప్రారంభం


మద్నూర్: పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం బీజేపీ నాయకులు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణతార మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో ఇంతవరకు ఒక్క డబుల్ బెడ్ రూం ఇల్లు కూడా నిర్మించలేదన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యే అయినా హన్మంత్ సింధే చేసిందేమీ లేదన్నారు. ఆయన నాలుగు ఇళ్లు నిర్మించుకున్నాడే గాని పేదలకు మాత్రం డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదన్నారు. నియోజకవర్గంలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, మున్సిపాలిటీ ఏర్పాటు చేయాలని, గ్రామాలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేసేంతవరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు హన్మండ్లు, నాయకులు కృష్ణ పటేల్, హన్మండ్లు, వీరేశం, వెంకట్ కాలే, తుకారాం, విష్ణు, మల్లికార్జున్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉప్పల్‌వాయి రైల్వే గేట్ మూసివేత

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి–ఉప్పల్‌వాయి రైల్వే స్టేషన్ల మధ్య ఈనెల 15, 16, 17 తేదీల్లో రైల్వే లైన్ల మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజులపాటు మోషంపూర్ సమీపంలోని 206వ నంబర్ రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ మూసివేయనున్నట్టు రైల్వే సెక్షన్ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గేట్ మీదుగా ప్రయాణించే వారు దీనిని గమనించాలని ఆయన సూచించారు.

ఆడపిల్లపై కొనసాగుతున్న వివక్ష

- ఓ వైపు భ్రూణ హత్యలు
- మరోవైపు ఆడశిశువుల అమ్మకం



ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా వివక్ష మాత్రం పోవడం లేదు. గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలిస్తే చాలు కడుపులోనే తుంచేస్తున్నారు. మరోవైపు పుట్టిన ఆడపిల్లల్ని అమ్ముకుంటున్న సంఘటనలూ వెలుగు చూస్తున్నాయి. జిల్లాలోని కొన్ని మారుమూల గ్రామాలు, తండాల్లో ఆడ శిశువుల విక్రయాలు ఇప్పటికీ కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

సాక్షి, కామారెడ్డి: ఆడపిల్లల కోసం ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయి. ముఖ్యంగా ఆడపిల్లల చదువుల కోసం కస్తూర్బా పాఠశాలలు, గురుకులాలను ఏర్పాటు చేసి వారికి మంచి విద్యనందిస్తున్నాయి. చదువుల్లో రాణించడం ద్వారా మహిళలు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు సొంతం చేసుకుంటున్నారు. అసాధ్యాలను సుసాధ్యం చేస్తున్నారు. అయినప్పటికీ ఆడపిల్లలపై వివక్ష మాత్రం పోవడం లేదు.

డెలివరీ అవగానే..

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఆడ శిశువుల అమ్మకం ఇప్పటికీ కొనసాగుతోంది. సంతానం లేనివారు పిల్లలను కొనుగోలు చేస్తున్నారు. కడుపులో బిడ్డ పెరుగుతున్నపుడే పేదరికంతో కొందరు అమ్ముకునేందుకు ఒప్పందం కుదుర్చుకుని, డెలివరీ అయిన ఒకటి రోజుల్లోనే అమ్ముతున్నారు. మారుమూల పల్లెలు, తండాల్లోనే కాదు పట్టణాల్లోనూ శిశువుల అమ్మకాలు సాగుతున్నాయి. పేదరికంతో ఇబ్బందుల్లో ఉన్నవారే ఆడ శిశువులను అమ్ముకుంటున్నట్టు తెలుస్తోంది. గర్భిణుల వివరాలను ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు నమోదు చేసుకుని రెగ్యులర్‌గా పౌష్టికాహారం అందిస్తున్నారు. కాన్పు తర్వాత కూడా వివరాలు నమోదు చేసుకుంటారు. కొన్నిచోట్ల రెగ్యులర్ ఫాలోఅప్‌తో అమ్మకాల విషయం వెలుగులోకి వస్తోంది. ఇటీవల రామారెడ్డి మండలంలో ఓ ఆడ శిశువు అమ్మకం జరిగింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందడంతో వారు విచారణ జరుపుతున్నారు. ఇంకా వెలుగు చూడని అమ్మకాలు చాలానే ఉంటాయని భావిస్తున్నారు.

విచ్చలవిడిగా లింగనిర్ధారణ పరీక్షలు..

జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో విచ్చలవిడిగా లింగనిర్ధారణ పరీక్షలు జరుపుతుండగా.. వైద్య, ఆరోగ్యశాఖ గతంలో డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి కేసు నమోదు చేసింది. అయితే సదరు ఆస్పత్రి నిర్వాహకులు రాజకీయ పలుకుబడితో కేసు నుంచి బయటపడినట్టు తెలుస్తోంది. అదే ప్రాంతంలో ఏర్పాటైన మరో ఆస్పత్రిలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అంతేగాక విచ్చలవిడిగా అబార్షన్లు చేస్తూ అడ్డగోలుగా దండుకుంటున్నారని తెలుస్తోంది. సదరు ఆస్పత్రికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూడా లింగనిర్ధారణ పరీక్షలు, అబార్షన్ల కోసం వస్తున్నారని సమాచారం. ఈ విషయం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు తెలిసినా అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలున్నాయి. మామూళ్ల మత్తులో మునిగిపోయి అక్రమ దందాకు సహకరిస్తున్నారని తెలుస్తోంది. జిల్లా యంత్రాంగం స్పందించి, లింగనిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు జరుపుతున్న ఆస్పత్రులపై నిఘా ఉంచి కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

వన్యప్రాణుల వేట!

రెచ్చిపోతున్న వేటగాళ్లు

- నాటు తుపాకులు, ఉచ్చులతో హతమారుస్తున్న వైనం
- అడవులు, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో వేట
- అరికట్టలేకపోతున్న అటవీశాఖ

ఇందూరు(నిజామాబాద్ అర్బన్)/బోధన్: వేటగాళ్లు రెచ్చిపోతున్నారు. పచ్చని ప్రకృతిలో స్వేచ్ఛగా తిరిగే వన్యప్రాణులను హతమారుస్తున్నారు. రాత్రుల్లో అడవులు, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో మాటువేసి యథేచ్ఛగా వేటాడుతున్నారు. నాటు తుపాకులు ఎక్కుపెట్టి, ఉచ్చులు బిగించి మూగజీవాల ఊపిరి తీస్తున్నారు. ఈ వేటను అటవీ శాఖ అధికారులు అరికట్టలేకపోతున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇటీవల కాలంలో రెండు, మూడు సంఘటనలు వెలుగు చూసినా, అటవీ అధికారులు అప్రమత్తంగా ఉండడం లేదు. వారం క్రితం బోధన్ ప్రాంతంలో ఓ వేటగాడు పట్టుబడిన విషయం తెలిసిందే. వేటగాడి ఇంట్లో సోదాలు నిర్వహించగా ఏకంగా జింక చర్మం, కొమ్ములు, నెమలి ఈకలు, ఒక నాటు తుపాకీ లభించింది. అయితే పట్టుబడకుండా దేనికీ జంకని వేటగాళ్లు జిల్లాలో చాలామంది ఉన్నారు. వారిపై నిఘా పెట్టాల్సిన అటవీ ఆఫీసర్లు డ్యూటీల్లో హాయిగా నిద్రపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి.



బోధన్‌లో వేటగాడి ఇంట్లో లభించిన తుపాకీ

స్థానిక వేటగాళ్లే ఎక్కువ..

కొన్ని నెలల క్రితం సింగరాయిపల్లిలో ఒక వేటగాడు బండరాళ్ల నడుమ ఇరుక్కుపోయిన ఘటనతో నిజామాబాద్, కామారెడ్డి అటవీ సరిహద్దు ప్రాంతాల్లో వేటగాళ్ల అలజడి ఉందని తేలిపోయింది. దీని తర్వాత సిరికొండ, ఇందల్వాయి అడవుల్లో సైతం వేటగాళ్ల కదలికలు కనిపించాయి. అయితే కొన్ని రోజులకే జిల్లాలో వన్యప్రాణుల వేట పెద్దగా లేదని అటవీ అధికారులు సరైన నిఘా పెట్టడం లేదు. బోధన్ ఘటనతో అటవీ అధికారులు మళ్లీ ఉలిక్కిపడ్డారు. ఈ వరుస ఘటనలను చూస్తే జిల్లాలో వేట ఇంకా సాగుతోందని స్పష్టమవుతోంది. గతంలో హైదరాబాద్ నుంచి వేటగాళ్లు వచ్చి జంతువులను వేటాడిన ఘటనలున్నాయి. రెండేళ్ల క్రితం వర్నిలో కొంతమంది వేటగాళ్లు పట్టుబడగా, వారి వద్ద నాటు తుపాకీ దొరికింది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వేటగాళ్లు అంతంత మాత్రంగానే ఉండగా, స్థానిక వేటగాళ్లు వన్యప్రాణుల్ని ఎక్కువగా వేటాడి మూగజీవాలను పొట్టన పెట్టుకుంటున్నారు. నాటు తుపాకులు పేల్చి, అలాగే విద్యుత్ వైర్లు, వలల సాయంతో ఉచ్చు బిగిస్తున్నారు.



పట్టుబడ్డ జింక చర్మం(ఫైల్)

మంజీర, ఎస్సారెస్పీ తీరాలలో..

ఎండలు ముదరడంతో అడవుల్లో జీవించే జింకలు, నెమళ్లు, కుందేళ్లు, ఆహారం, నీళ్ల కోసం బయటకు వస్తున్నాయి. నీళ్ల కొలనులకు కొద్ది దూరంలో వేటగాళ్లు మాటు వేసి ఎయిర్‌గన్‌లు, ఉచ్చులు ఏర్పాటు చేస్తున్నారు. కాగా మంజీర, ఎస్సారెస్పీ గోదావరి తీరాల్లో పచ్చికబయళ్లు తేలడంతో జింకలు, దుప్పిలు, కుందేళ్లు గడ్డిని తినడానికి బయటకు వస్తున్నాయి. దీంతో వేటగాళ్లు ఈ ప్రాంతాల్లో ఎక్కువ వేటను సాగిస్తున్నారు. జింక, నెమలి, కుందేలు, ఏదు, దుప్పి, ఉడుము, అడవి పంది మాంసానికి డిమాండ్ ఉండడంతో స్థానిక వేటగాళ్లు మరింత రెచ్చిపోతున్నారు. బడాబాబుల పార్టీలకు సైతం ఇప్పటికీ అటవీ జంతువుల మాంసాన్ని గుట్టుగా సరఫరా చేస్తున్నారనే మాటలు ప్రచారంలో ఉన్నాయి. అధికారులే వేటగాళ్లకు కొమ్ము కాస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి.



ధాన్యం ఆరబోసేందుకు అడ్వాన్స్ రిజర్వ్!

నాగిరెడ్డిపేట: వరి కోతలు ప్రారంభం కావడంతో ధాన్యాన్ని ఆరబోసేందుకు పలువురు రైతులు రహదారులపై రాళ్లు, ఇతర వస్తువులు ఉంచి, రిజర్వ్ చేసుకుంటున్నారు. ధాన్యం ఆరబోసేందుకు అవసరమైన కల్లాలు లేకపోవడంతో రహదారులనే కల్లాలుగా మార్చుకుంటున్నారు. మండలంలోని వెంకంపల్లి గ్రామ శివారులో రైతులు వరి ధాన్యం ఆరబోసుకునేందుకు ప్రధాన రహదారిపై స్థలాలను ముందస్తుగా రిజర్వ్ చేసుకున్నారు.

క్లుప్తంగా

బెటాలియన్‌లో ఇఫ్తార్



డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలోని బెటాలియన్‌లో శుక్రవారం సాయంత్రం కమాండెంట్ ఎన్‌వీ సత్య శ్రీనివాసరావు ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ ఎం వెంకటేశ్వర్లు, ఆంజనేయరెడ్డి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూటరీలకు నీటి విడుదల



సాక్షి ఎఫెక్ట్..

మోర్తాడ్: కాకతీయ కాలువ డిస్ట్రిబ్యూటరీల కింద ఉన్న వరి పంటకు నీటి విడుదలను నిలిపివేయడంతో సాక్షి పత్రికలో గురువారం 'చివరికెలా?' శీర్షికన వచ్చిన కథనానికి ఎస్సారెస్పీ అధికారులు స్పందించారు. వరి పొట్ట దశకు చేరుకోగా కోతలకు ఇంకా పది రోజుల సమయం ఉంది. అంతలోనే నీటి విడుదలను నిలిపివేయడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. ఈ అంశంపై సాక్షిలో కథనం ప్రచురించగా అధికారులు స్పందించి శుక్రవారం నుంచి నీటి విడుదలను పునఃప్రారంభించారు. వరి కోతలు మొదలయ్యే వరకు నీటిని విడుదల చేస్తామని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు.

పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి




నిజామాబాద్‌అర్బన్: వేసవి సెలవుల్లో టీచర్లకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో ఆయన నిర్మలహృదయలో పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మదన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సంఘం నాయకులు చందర్, లింగం, మల్లేశం, గంగాప్రసాద్, గోపీ, గంగాధర్ ఉన్నారు.

ఫ్రాంచైజ్ అవకాశం
కేవా కైపో 500+ ప్రొడక్ట్స్.
ప్రాఫిట్ 25%. ఫ్రీ ట్రైనింగ్.
బై వన్ గెట్ వన్ ఫ్రీ. ఫ్రీ డెలివరీ.
9676070879

ప్రభుత్వ భూమిని పంచుకున్నారు!

- తలా కొంత పట్టా చేసుకున్న రెవెన్యూ సిబ్బంది
- దర్జాగా రైతు బంధు స్వాహా
- గ్రామస్తులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



మోకన్‌పల్లి శివారులో 653 సర్వే నంబరులోని గుట్ట

నవీపేట: ఆక్రమణలు, కబ్జాల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన రెవెన్యూ సిబ్బందే స్వాహా చేశారు.. ఉన్నతాధికారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని తమతో పాటు మరికొందరి పేర్లపై పట్టాలు చేయించి అందినంత దండుకున్నారు. రాళ్ల రప్పలతో కూడిన భూమిని తమ పేర రిజిస్ట్రేషన్ చేయించుకొని రైతు బంధు పొందుతున్నారు. నవీపేట మండలంలోని మోకన్‌పల్లి శివారులో 653 సర్వే నంబరులో 75.38 ఎకరాల విస్తీర్ణంలో భూమి ఉంది. ఈ భూమిలో కేజీబీవీ, శ్మశాన వాటిక నిర్మించారు. మరి కొంత మందికి పట్టాలు ఉన్నాయి. మరో 31 ఎకరాలు ప్రభుత్వ ఆధీనంలో ఉంది. ఈ 31 ఎకరాల్లో పెద్ద పెద్ద రాళ్లు, రప్పలు, చెట్లతో కూడుకొని గుట్ట మాదిరి ఉంటుంది. పదేళ్ల కిందట నవీపేట తహసీల్దార్‌గా పని చేసిన ఓ అధికారి హయాంలో కొందరు రెవెన్యూ ఉద్యోగులు అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు గుప్పుమన్నాయి. అధికారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన మరో వ్యక్తి రెవెన్యూ శాఖను తన గుప్పిట్లో పెట్టుకుని అజమాయిషి చలాయించాడు. గతంలో ఆయన వ్యవహారంపై పలు ఫిర్యాదులు కూడా ఉన్నతాధికారులకు వెళ్లాయి. బదిలీ చేశారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సదరు సీనియర్ అసిస్టెంట్ సహకారంతో వీఆర్వో, ఇద్దరు వీఆర్‌ఏలు 653 సర్వే నంబరులో భూమిని పట్టా చేసుకున్నారు. వీఆర్వో రెండు ఎకరాలు, వీఆర్‌ఏలు ఎకరం చొప్పున పట్టా చేసుకున్నారు. అంతేకాకుండా డబ్బులు తీసుకొని మరికొంత మందికి ఆ భూమిని పట్టా చేశారు. ఈ సర్వే నంబర్‌లో మొత్తం 20 ఎకరాల వరకు ప్రభుత్వ భూమికి ఇలా పట్టాలు సృష్టించారు.

ప్రభుత్వ పథకాలతో లబ్ధి

ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమికి పట్టాలు ఇచ్చే అధికారం సంబంధిత చైర్మన్‌కు ఉంటుంది. దీనికి ఎమ్మెల్యే చైర్మన్‌గా ఉండి నియమ నిబంధనల మేరకు అర్హులైన పేదలకు జీవనోపాధి నిమిత్తం పట్టాలు జారీ చేస్తారు. కానీ సర్వే నంబరు 653లో రెవెన్యూ ఉద్యోగులు అన్నీ తామై వ్యవహరించారు. ఉన్నతాధికారిని నమ్మించి తాము అనుకున్నది సాధించారు. పదేళ్ల కిందట మోకా మీద(కబ్జాలో) లేకున్నా పట్టాలు పొందిన వ్యక్తులు దర్జాగా బ్యాంకు రుణాలు పొందుతున్నారు. అలాగే ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బంధు పథకంతో లబ్ధి పొందుతున్నారు. అక్రమంగా పట్టాలు పొందిన ఉదంతంపై గతంలో గ్రామానికి చెందిన పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇదే అదునుగా భావించిన పట్టా పొందిన వీఆర్వో గుట్ట అంచున ఉన్న రాళ్లు, రప్పల భూమి తనదేనని ఇటీవల చదును చేయడానికి యత్నించారు. చుట్టు పక్కల పట్టాదారు రైతులు ఆయనను అడ్డుకున్నట్లు తెలిసింది.

నా హయాంలో పట్టాలు ఇవ్వలేదు

మోకన్‌పల్లి శివారులోని సర్వే నంబరు 653లో నా హయాంలో ఎవరికి పట్టాలు ఇవ్వలేదు. పట్టాల జారీ విషయంతో నాకు ఎలాంటి సంబంధం లేదు. మోకా మీద లేకున్నా ప్రభుత్వ అసైన్డ్ భూమిలో సంబంధిత చైర్మన్(ఎమ్మెల్యే) ఆదేశాల మేరకు అర్హులైన పేదలకు పట్టా జారీ చేయవచ్చు. సర్వే నంబర్‌లో 653లో అలా జరగలేదు. ఫిర్యాదులు వస్తే పరిశీలిస్తాం. – వీర్‌సింగ్, తహసీల్దార్, నవీపేట

వైద్యం వికటించిందని ఆందోళన

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో గల ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం వికటించిందని బాధితురాలి కుటుంబ సభ్యులు శుక్రవారం ఆందోళనకు దిగారు. వారి కథనం మేరకు.. ఏర్గట్ల మండలం బట్టాపూర్‌కు చెందిన బుక్యా మేనిబాయ్(65) కాలుకు 15 రోజుల క్రితం ఆస్పత్రిలో కాలుకు శస్త్ర చికిత్స చేసి రాడ్ అమర్చారు. చికిత్స చేసిన రెండు రోజులకే కాలుకు వాపు రావడంతో కుటుంబ సభ్యులు తిరిగి ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు మరో మారు శస్త్ర చికిత్స చేసి ఇంటికి పంపించారు. మళ్లీ కాలుకు వాపుతో పాటు చీము రాగా కుటుంబ సభ్యులు సదరు మహిళను ఆస్పత్రికి తీసుకు వచ్చారు. పరీక్షించిన వైద్యులు కాలుకు సెప్టిక్ అయి రక్తం గడ్డకట్టిందని ఇప్పుడు తామేమి చేయలేమని చేతులెత్తాసారు. అలాగే ఇంటికి తీసుకెళ్లాలని నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మహిళకు ఇలా జరిగిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి వైద్యుడు చంద్రశేఖర్ రెడ్డి స్పందిస్తూ తమ తప్పు ఏమిలేదని, సక్రమంగానే చికిత్స అందించామని వెల్లడించారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రదర్శన ఇస్తున్న కళాబృందం సభ్యులు

మోపాల్: ప్రజలు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మహేష్ సూచించారు. మండలంలోని కులాస్‌పూర్ గ్రామంలో శుక్రవారం పోలీసు కళాజాత ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పలు అంశాలపై కళాజాత బృందం సభ్యులు ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. గల్ఫ్ నకిలీ ఏజెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్పంచ్ మమత సాయిరెడ్డి, ఉప సర్పంచ్ అనిల్, ఏఎస్సై రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా బైసాఖీ ర్యాలీ

నిజామాబాద్ సిటీ: సిక్కుల కొత్త సంవత్సరం సందర్భంగా ప్రతియేటా నిర్వహించే బైసాఖీ ర్యాలీ శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. నగరంలోని పాములబస్తీ గురుద్వార్ నుంచి గాజుల్‌పేట్ గురుద్వార్ వరకు సిక్కు మతస్తులు రథంతో ర్యాలీ నిర్వహించారు. సిక్కుల ఆరాధ్యదైవం గురునానక్ తలచుకుంటూ భక్తిశ్రద్ధలతో బైసాకి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో తల్వార్‌తో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిక్కులు

హామీలు మరిచిన ప్రభుత్వాలకు బుద్ధి చెబుదాం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మోహన్‌రెడ్డి

మోర్తాడ్: ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా వ్యవహరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెబుదామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని శెట్‌పల్లిలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై భారం మోపితే, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు మరిచిపోయిందన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లను పంపిణీ చేయడంలో విఫలమైందన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముత్యాల రాము, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణు రాజ్, నాయకులు రొక్కం మురళి, గురిజాల నర్సారెడ్డి, మహిపాల్, అనిల్, సుదర్శన్, రాజ్‌కుమార్, అఖిల్, బద్దం రాజశేఖర్, అశ్రఫ్, శివ, నిఖిల్‌రెడ్డి, గంగాధర్, రంజిత్, ఆనంద్, నవీన్, శ్రీనివాస్, రాము, లింబాద్రి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నిజామాబాద్‌నాగారం: అంబేడ్కర్ జయంతి సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఉపన్యాస పోటీల్లో ఆకాంక్ష భోంస్లే, అక్షిత, సాయిరాం, వ్యాసరచనలో శిల్పారాణి, తన్వి చందరాణా, ధీరజ్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి నిర్వాహకులు బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. మోహన్‌దాస్, నవత వినయకుమార్, జిల్లా యువజన అధికారి శైలి బెల్లాల్, కేంద్ర సిబ్బంది లత, హరీష్ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లో నేటి నుంచి రెండురోజులపాటు నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ ఆల్‌పెన్షనర్స్–రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. నాందేవ్‌వాడలోని సంఘ కార్యాలయంలో వారు శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే పేరివిజన్ కమిటీ ఏర్పాటు చేయాలని, నగదు రహిత వైద్యం అన్ని కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులలో అనుమతించాలన్నారు. పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని, ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. మహాసభలో ప్రధాన సమస్యలపై చర్చించి కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామన్నారు. కార్యదర్శి సూదం మదన్‌మోహన్, కోశాధికారి ఈవీఎల్ నారాయణ, జిల్లా నాయకులు ముత్తారం నరసింహాస్వామి, సుదర్శన్‌రాజ్, ప్రసాద్‌రావు, భోజరావు ఉన్నారు.

షాపుల ముందు తోపుడు బండ్లు తొలగించాలి



ఖలీల్‌వాడి: నగరంలోని గోదాం రోడ్డు, గోశాల ప్రాంతంలో షాపుల ముందు తోపుడు బండ్లు ఉంచడంతో ఇబ్బంది అవుతోందని షాపు అసోసియేషన్ సభ్యులు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబుకు ఫిర్యాదు చేశారు. షాపుల ముందు రోడ్లలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. అలాగే షాపుల ఎదుట వాహనాలను నిలుపుకోవడానికి ఇబ్బంది అవుతోందన్నారు.

నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకించండి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నేత నరేందర్

కమ్మర్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్ పిలుపునిచ్చారు. ఈ విద్యా విధానంతో వెనుకబడిన తరగతుల వర్గాలకు విద్య అందని ద్రాక్షలాగా మారుతుందని ఆరోపించారు. శుక్రవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థి నేత కామ్రేడ్ జార్జిరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా ప్రగతిశీల భావాలకు నిలయమైన విశ్వవిద్యాలయాల్లో అన్యాయాలను ఎదిరించి పీడిత విద్యార్థి లోకానికి అండగా నిలిచిన కామ్రేడ్ జార్జిరెడ్డిని మతోన్మాదులు దారుణంగా హత్య చేశారని గుర్తు చేశారు. నాయకులు అశోక్, కిషన్, సత్తెక్క పాల్గొన్నారు.

అంబేడ్కర్, జార్జిరెడ్డిలను ఆదర్శంగా తీసుకోవాలి



నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఖలీల్‌వాడి: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, పీడీఎస్‌యూ వ్యవస్థాపకులు జార్జిరెడ్డిలను ఆదర్శంగా తీసుకొని సమస్యలపై పోరాడాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ పేర్కొన్నారు. కోటగల్లీలోని ఎన్‌ఆర్ భవన్‌లో శుక్రవారం అంబేడ్కర్ జయంతి, జార్జిరెడ్డి వర్ధంతి నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు ఆకుల పాపయ్య, వేల్పూర్ భూమయ్య, సాయిబాబా, ఎల్ బి రవి, శివకుమార్, దేవిక, సునీల్, నిఖిల్, సత్యం, శంకర్, రాజు, మోహన్, మల్లేష్, యశ్వంత్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
■ బాలాజీ గోల్డ్. మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 9032040019. [T-08]
■ అతి తక్కువ డాక్యుమెంట్స్‌తో రుణాలు ఇవ్వబడును. వ్యక్తిగత, ప్రాపర్టీ, వ్యాపారం, వ్యవసాయం, మార్ట్‌గేజ్ రుణాలు ఇవ్వబడును. సంప్రదించండి: 7731886547. [T-20]

AGRI BUSINESS
■ నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ స్కీమ్, N.L.M. Scheme నేషనల్ డైరి బ్రీడ్ స్కీమ్, నేషనల్ హార్టికల్చర్ స్కీమ్, కోల్డ్ స్టోరేజ్ స్కీమ్‌కు సంబంధించిన ప్లాన్లు, అప్రూవల్, ఎస్టిమేట్లు, కన్‌స్ట్రక్షన్స్ చేయబడును. సంప్ర॥ 85208 66463. [M-9322]

REAL ESTATE

FOR SALE
■ బేకరి అమ్మకము: నిజామాబాద్ పట్టణములో గంగాస్థాన్ మెయిన్‌రోడ్ పైన IOC పెట్రోల్ పంపు ఎదురుగా రన్ అవుతున్నా ఆరెంజ్ బేకరి అమ్మబడును. Cell 9440871706. [Z-772227]

FLAT FOR SALE
■ LAUNCHING OFFER: రూ. 3లక్షలకే 18 లక్షల విలువ గల 1050Sft. గల 2BHK Flat సొంతం చేసుకోండి, ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి Temple నుండి 2కి.మీ. మాత్రమే ఫోన్: 9948525151, 6262838353 మార్కెటింగ్ కు ఏజెంట్లు కావలెను. [HA-29333]

WANTED
■ Wanted Teachers to Teach all Subjects from Nursery to X - Std. E/m. Liberty High School, Subash Nagar,Nzb.Cont on Cell:8309582476 [Z-772221]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

■ Qualified Staff D.Pharma, B.Pharma for Medical Shop. B.Sc. Nursing, ANM, GNM Staff for Hospital. Experienced Computer Operator. Cont No.8790332690 & 9346605125. [Z-772230]
■ NZBలో గల రెడిమెడ్ లేడిస్ బట్టల షాపులో పనిచేయుటకు అనుభవం గల సేల్స్ గర్ల్స్ కావలెను. సంప్రదించండి. సెల్:7036466674, 08462357770. [Z-772229]
■ సెక్యూరిటి గార్డులు జీతం: 14,000/- + 3000/- PF, ESI. సెక్యూరిటి సూపర్‌వైజర్ 17,000/- + 3000/- PF + ESI. నర్సాపూర్‌కి కావలెను. 12గం॥. ఫోన్: 95535 85804 [V-775196]
■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785739]
■ HYDలో అర్జంటుగా సెక్యూరిటీ గార్డ్స్, RTC కార్గో బస్‌లకు బాయ్స్, అటెండర్స్ కావలెను. (కన్సల్టెన్సీ కాదు) మంచి జీతం వసతి కలదు. సంప్ర: 040-66666664, 9392663777, 9246663777. [HA-1330]
■ Hydలో ప్రముఖ ఇ-కామర్స్, ఫార్మా, MNC కంపెనీలకై హెల్పర్స్, ప్యాకర్స్, సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్, కేటరింగ్ బాయ్స్ కావలెను. రూం, భోజనం ఫ్రీ. జీ. 15,000-30,000. ఫోన్.9121989324 [HA-10717]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరదమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్

మల్లాపూర్ వీఆర్‌ఏ మృతి

- రాత్రంతా రోడ్డుపైనే..

మద్నూర్: డోంగ్లీ మండలం మల్లాపూర్‌లో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న తాడుకోల్ అశోక్ (45) మృతి చెందినట్లు ఎస్సై కృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అశోక్ రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు గురువారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో విధి నిర్వహణలో భాగంగా మద్నూర్‌కు వచ్చాడు. అనంతరం ఇక్కడే మద్యం తాగి రోడ్డు పక్కన పడుకున్నాడు. శుక్రవారం ఉదయం వరకు లేవలేదు. దీంతో స్థానికులు మద్నూర్ తహసీల్ కార్యాలయానికి వెళ్లే దారిలో అశోక్ పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకొని అశోక్‌ను ఆస్పత్రికి తరలించామని అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారని ఎస్సై అన్నారు. అతిగా మద్యం తాగడంతోనే అశోక్ మృతి చెంది ఉండొచ్చని ఎస్సై అభిప్రాయం వ్యక్తం చేశారు.

పేకాట స్థావరంపై దాడి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నరేష్ శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ. 22వేలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. సదరు యువతి గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గొలుసు చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం నడిపల్లి శివారులో ఈ నెల 6న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ చేసిన ఇద్దరు నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గణేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. అమృతాపూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బొద్దుల సరిత ఉద్యోగ రీత్యా ఈ నెల 6న నిజామాబాద్ వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి నడుచుకుంటూ వెళ్తోంది. మార్గమధ్యలో నడిపల్లి స్కూల్ వద్దకు రాగానే బాల్కొండ మండలం దూస్‌గాం గ్రామానికి చెందిన శేక్ అబ్దుల్ జునైద్, కొయ్యల సాయికృష్ణ బైక్‌పై ఎదురుగా వచ్చి సరిత మెడలోని రెండు తులాల పుస్తెలతాడు లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సీసీటీవీ పుటేజీల ఆధారంగా ఇద్దరు నిందితులను పట్టుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి పుస్తెల తాడు, బైక్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

దోమకొండ: మండలంలోని సంఘమేశ్వర్ గ్రామానికి చెందిన మన్నె నవీన్‌కుమార్(35) అప్పుల బాధతో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై సుధాకర్ తెలిపారు. వివరాలు.. నవీన్‌కుమార్ గ్రామంలో ఇల్లు కట్టాడు. ఇంటి నిర్మాణానికి అప్పులు చేశాడు. అప్పులు తీరకపోవడంతో జీవితంపై విరక్తి చెంది వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

కడుపు నొప్పి భరించలేక..

సదాశివనగర్: కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాలు.. సదాశివనగర్‌కు చెందిన మర్కంటి గంగయ్య(70) కొన్ని సంవత్సరాల నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఎంతకి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 10న గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఎల్లారెడ్డిపేటలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. గంగయ్య పరిస్థితి మరింత విషమంగా ఉందని డాక్టర్లు తెలుపడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కోడలు స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరు..

నిజాంసాగర్: మండల కేంద్రానికి చెందిన గులాని సాయిలు(36) మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై నాగగోని రాజు తెలిపారు. ప్రతి రోజు మద్యం తాగి జులాయిగా తిరుగుతున్న సాయిలు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై చెప్పారు. మృతుడి భార్య అంజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో పంచాయతీ కార్మికుడు..




సంజీవ్ (ఫైల్)

డిచ్‌పల్లి: మండలంలోని కొరట్‌పల్లి గ్రామ పంచాయతీ కార్మికుడు తలారి సంజీవ్ (62) ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు. వివరాలు.. సంజీవ్ ఆర్థిక సమస్యలతో మానసికంగా బాధపడుతూ తాగుడుకు అలవాటు పడ్డాడు. జీవితంపై విరక్తి చెంది శుక్రవారం సాయంత్రం గ్రామ శివారులోని మామిడిచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య భాగిర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

అంత్యక్రియల కట్టెల కోసం వెళ్తుండగా..

- బోల్తా పడిన ట్రాక్టర్
- ఒకరి మృతి, మరో నలుగురికి గాయాలు



పోచయ్య(ఫైల్)

సదాశివనగర్: అంత్యక్రియలకు కట్టెలు తీసుకు రావడానికి వెళ్తుండగా ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందారు. మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి శివారులో జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో మరో నలుగురు గాయపడ్డారు. వివరాలు.. సదాశివనగర్‌కు చెందిన గంగయ్య గురువారం రాత్రి మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలు నిర్వహించడానికి కట్టెలు తీసుకు రావడానికి అగ్గు పెద్ద పోచయ్య(41), జోగిని పెద్ద రాజయ్య, జోగిని బీరయ్య, జోగిని స్వామి, మార్కంటి బీరయ్య ట్రాక్టర్‌పై కామారెడ్డికి బయలు దేరారు. ట్రాక్టర్‌ను అతివేగంతో, అజాగ్రత్తగా నడుపడంతో ఇంజన్ ముందు టైర్, వెనుక టైర్ పగిలింది. దీంతో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో పోచయ్య మృతి చెందగా, మరో నలుగురికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నలుగురిని హైదరాబాద్ తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సురేందర్ వైద్యులతో మాట్లాడి వారిని ఆస్పత్రిలో చేర్పించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

మోపాల్: మండలంలోని తాడెం శివారులోగల ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తున్న గేదె విద్యుత్ షాక్‌కు గురై శుక్రవారం మృత్యువాత పడింది. మోపాల్‌కు చెందిన పడమటి నరేష్ గేదె రోజూలాగే తాడెం సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న పంట పొలాల్లో మేతకు వెళ్లింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాత పడింది.

జంగంపల్లిలో చోరీ



భిక్కనూరు: మండలంలోని జంగంపల్లిలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన మ్యాదరి రాజయ్య దోమకొండలో వెదురు బొంగులు అమ్మే దుకాణం పెట్టుకుని జీవిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం రాజయ్య తన భార్య సిద్ధవ్వతో కల్సి ఇంటికి తాళం వేసి దోమకొండ దుకాణానికి వెళ్లాడు. రాత్రి వారు అక్కడే ఉండి శుక్రవారం మధ్యాహ్నం జంగంపల్లిలోని వారి ఇంటికి వచ్చారు. వచ్చే సరికి తాళం పగుల గొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా పది గ్రాముల బంగారు ఆభరణాలు, ఎనిమిది తులాల వెండి ఆభరణాలు చోరీ అయినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు క్లూస్ టీమ్‌ను రప్పించి వేలి ముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ వివరించారు.